క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో హనుమాన్ విగ్రహ ప్రతిష్ట



కొండాపురం: మండలంలోని మర్రిగుంటలో హనుమాన్ విగ్రహ ప్రతిష్టను శుక్రవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితుల వేదమంత్రోచ్చరణ నడుమ విశేషాభిషేకాలు, పూజలు, హోమాలు నిర్వహించారు. అనంతరం ప్రాణ ప్రతిష్ట చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శ్రీగంధం చెట్ల నరికివేతపై పరిశీలన



ఉదయగిరి రూరల్: మాసాయిపేట బీసీ కాలనీ సమీపంలోని గానుగపెంట నారాయణరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో శ్రీగంధం చెట్లను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసిన ఘటనపై ఎస్సై కర్నాటి ఇంద్రసేనారెడ్డి శుక్రవారం విచారణ చేపట్టారు. క్షేత్రం వద్దకు వెళ్లి నరికివేసిన చెట్ల మోడులు, దుంగలను తరలించిన వాహనం జాడలను పరిశీలించి రైతుని అడిగి వివరాలు నమోదు చేసుకున్నారు. రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని ఎస్సై తెలిపారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.315

మర్రిపాడు: డీసీపల్లి పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.315 లభించింది. వేలానికి 1053 బేళ్లు రాగా, 705 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.60, సగటున రూ.122.18 ధర లభించిందని వేలం నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. వేలంలో 11 కంపెనీలకు చెందిన వ్యాపార ప్రతినిధులు పాల్గొన్నారు.


కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శుక్రవారం కిలో పొగాకుకు గరిష్ట ధర రూ.326 లభించింది. వేలానికి జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 568 బేళ్లను తీసుకురాగా, 394 బేళ్లను కొనుగోలు చేశారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.315, కనిష్టంగా రూ.60, సగటున రూ.190.57 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు



కావలి(అల్లూరు): కావలిలోని వెంగళరావునగర్‌లోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలోని 140 మంది విద్యార్థులకు రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. కావలి రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ఐడీలు ఇవ్వాలని వినతి



ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలో నూతనంగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు హెచ్‌ఆర్ఎంఎస్, సీఎఫ్ఎంఎస్ ఐడీలను ఇవ్వాలని యూటీఎఫ్ నాయకులు కోరారు. ఈ మేరకు ఆత్మకూరు ఉపఖజానా కార్యాలయ అధికారులకు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఉపఖజానా అధికారులు త్వరలోనే ఐడీలను అందజేస్తామని హామీ ఇచ్చారు.

బాల్యవివాహాలతో అనర్థాలు



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం ఊటుకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షకీల విద్యార్థినులకు బాల్యవివాహాలతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. బాల్యవివాహాలతో శారీరక ఎదుగుదల లోపిస్తుందని, అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. బాలికలు 18ఏళ్లు నిండిన తరువాతే వివాహం చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు మాల్యాద్రి, డేగా శ్రీనివాసులు, ధనలక్ష్మి, మాజీ ఎంపీటీసీ రొడ్డా కొండయ్య, అంగన్‌వాడీలు విజయలక్ష్మి, సుభద్రమ్మ, రాధ, సుజాత, చెన్నమ్మ పాల్గొన్నారు.

ప్రజాధనం గుంతలపాలు





ఆత్మకూరులో దెబ్బతిన్న ప్రధాన రహదారి

అధ్వానంగా మెయిన్‌రోడ్డు

- గతేడాది రూ.5లక్షలతో మరమ్మతులు
- తొమ్మిది నెలలకే లేచిపోయిన ప్యాచ్‌వర్కులు
- గుంతల్లో రాకపోకలు సాగించలేక వాహనచోదకుల అవస్థ

ఆత్మకూరు: పట్టణంలోని మెయిన్‌రోడ్డు అధ్వానంగా తయారైంది. ఆర్టీసీ డిపో వద్ద నుంచి సోమశిల రోడ్డు కూడలి వరకు రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. 2024 ఎన్నికలకు ముందు తాము అధికారంలోకి వస్తే రోడ్లను అద్దంలా తీర్చిదిద్దుతామని చంద్రబాబునాయుడు ఊదరగొట్టారు. అధికారంలోకి వచ్చాక దెబ్బతిన్న రోడ్లను పునర్నిర్మించకుండా ప్యాచ్‌వర్క్‌లతో మమ అనిపించారు. రోడ్ల మరమ్మతు పనులను నాసిరకంగా చేపట్టడంతో మూణ్నాళ్లకే మళ్లీ యథాస్థితికి వచ్చాయి. లక్షలాది రూపాయల ప్రజాధనం గుంతలపాలైంది. పట్టణంలోని ఆర్అండ్‌బీ ఆధీనంలోని మెయిన్‌రోడ్డు ఆర్టీసీ డిపో నుంచి సోమశిల కూడలి వరకు అరకిలోమీటర్ దూరం దెబ్బతినగా గతేడాది రూ.5 లక్షలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. అయితే తొమ్మి నెలలకే ప్యాచ్‌వర్కులు లేచిపోయి మళ్లీ యథాప్రకారం రోడ్డు గుంతలమయంగా తయారైంది. వర్షం పడితే నీరు నిలిచి గుంతలు కనిపించక పోతుండడంతో వాహనచోదకులు ప్రమాదాల పాలవుతున్నారు. పాదచారులు సైతం రోడ్డుపై నడిచి వెళ్లేందుకు పడుతున్నారు.



రోడ్డుపై ఏర్పడిన భారీ గుంత

ప్రజాధనం దుర్వినియోగం



పట్టణంలోని ప్రధాన రహదారికి గతేడాది లక్షలాది రూపాయలు వెచ్చించి మరమ్మతులు చేపట్టారు. నాసిరకంగా పనులు చేపట్టడంతో తొమ్మిది నెలలకే రోడ్డు మళ్లీ యథాస్థితికి చేరింది. రోడ్డును పునర్నిర్మించకుండా ప్యాచ్‌వర్కులతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం సరికాదు.

– నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు

పునర్నిర్మించాలి



ఆత్మకూరులోని మెయిన్‌రోడ్డు అధ్వానంగా ఉంది. అడుగడుగునా గుంతలు ఏర్పడడంతో వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు పడిన సమయంలో పరిస్థితి దారుణంగా ఉంటోంది. మంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్నా రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడం దురదృష్టకరం.

– షేక్ సందానీ, మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్, ఆత్మకూరు

మొక్కుబడిగా మండల సర్వసభ్య సమావేశం

వరికుంటపాడు: మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ గవదకట్ల వెంకటలక్ష్మమ్మ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. తొలుత అధికారులు శాఖలవారీగా ప్రగతిని వివరించారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు సీసీ రోడ్లు, గ్రావెల్ రోడ్లు, భవన నిర్మాణాల ప్రగతిని వివరించారు. వెలుగు ఏపీఎం స్వయం సహాయక సంఘాలకు అందిస్తున్న సబ్సిడీ పథకాలను తెలిపారు. ఇరిగేషన్ ఏఈ చెరువుల అభివృద్ధి పనులు, హౌసింగ్ ఏఈ గృహ నిర్మాణాల పురోగతిని వివరించారు. వరికుంటపాడు సర్పంచ్ కొండెపోగు దిలీప్ మాట్లాడుతూ ఉపాధి కూలీల సమస్యలు, వేతనబకాయిలు, ఆధార్ సెంటర్ లేక



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎంపీడీఓ డీవీ రమణారెడ్డి, జెడ్పీటీసీ రావెల నాగేంద్ర, ఎంఈఓ–2 సీహెచ్ రమణయ్య, సొసైటీ చైర్మన్ గుర్రం గోపి, వైస్ఎంపీపీలు దేవనబోయిన మధు, చంచల మధు, ఇరిగేషన్ ఏఈ రమేష్, వ్యవసాయశాఖ ఏఓ సునీల్, పీఆర్ ఏఈ మనోహర్, తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజేఐపై దాడియత్నం అమానుషం



కావలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీస్ నాయకులు



వింజమూరులో..



కొండాపురంలో..

కావలి(అల్లూరు)/దగదర్తి/వింజమూరు/కొండాపురం: భారత ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై న్యాయవాది దాడికి యత్నించడం అమానుషమని ఎమ్మార్పీఎస్ నాయకులు ఖండించారు. కావలి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీస్ నాయకులు శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. సీజేఐపై దాడికి యత్నించిన న్యాయవాదిని కఠినంగా శిక్షించి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎమ్మార్పీస్ నాయకులు చేవూరు కిరణ్ కుమార్, మంద వెంకటేశ్వర్లు మాదిగ, యేసు రత్నం మాదిగ, కత్తి శివ మాదిగ, చేవూరు ఆదిత్యమాదిగ, జాన్సన్ మాదిగ పాల్గొన్నారు.

- వింజమూరులో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ర్యాలీ చేపట్టి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పందిటి అంబేద్కర్ మాదిగ, గోచిపాతల ఆనంద్, మంద సుజాత, తదితరులు పాల్గొన్నారు.
- సీజేఐపై దాడి యత్నాన్ని ఖండిస్తూ కొండాపురంలో ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు గోసాల సుధాకర్, కొప్పర్తి సుధాకర్, బండారు చంద్ర తదితరులు పాల్గొన్నారు.
- దగదర్తి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం తహసీల్దార్ పీ కృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మార్పీఎస్ నాయకులు గోచిపాతల వెంకటేశ్వర్లు, కావలి శ్రీనివాస్, నూనె జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గంధ మహోత్సవం

ఉదయగిరి: పట్టణంలోని కోన కాలువ సమీపంలో ఉన్న మహబూబ్ సుభాని దర్గాలో గంధ మహోత్సవాన్ని శనివారం వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం రాత్రి హక్కుదారుల ఇంటి వద్ద నుంచి గంధాన్ని తీసుకుని ఊరేగింపుగా బయలుదేరి వేకువజామున దర్గా వద్దకు చేర్చనున్నట్లు చెప్పారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు పంచి పెట్టనున్నట్లు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

దుత్తలూరు: మండల సర్వసభ్య సమావేశం తగిన కోరం లేక వాయిదా పడింది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు ఏర్పాటు చేసిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ, వైస్ఎంపీపీతో పాటు పలువురు ఎంపీటీసీలు గైర్హాజరయ్యారు. ఎంపీడీఓ ఎల్ చెంచమ్మ కొంతసేపు నిరీక్షించినా కోరానికి సరిపడా ఎంపీటీసీలు హాజరుకాలేదు. దీంతో కోరం లేక సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీఓ ప్రకటించారు.

అదృశ్యమైన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు

ఉదయగిరి: అదృశ్యమైన విద్యార్థి ఆచూకీ తెలిసింది. మండలంలోని అన్నంపల్లె గ్రామానికి చెందిన విద్యార్థి యగటీల వెంకట యోగేష్ బుధవారం మధ్యాహ్నం కళాశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అయితే వెంకటయోగేష్ తాను తిరుపతిలో ఉన్నట్లు కుటుంబ సభ్యులకు సెల్‌ఫోన్ ద్వారా సమాచారం అందించగా వారు వెంటనే వెళ్లి పోలీసు స్టేషన్‌కు శుక్రవారం తీసుకొచ్చారు. ఎస్సై ఇంద్రసేనారెడ్డికి విషయం తెలిపి ఇంటికి తీసుకెళ్లారు.

కర్రతుమ్మ చెట్ల వేలం

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని యర్రబల్లిపాళెం, పాతూరు చెరువుల్లోని కర్రతుమ్మ చెట్ల వేలాన్ని ఇరిగేషన్ అధికారులు శుక్రవారం నిర్వహించారు. వేలంలో పాతూరు చెరువులోని చెట్లను జీ కోటేశ్వరరావు రూ.1.04 లక్షలు, యర్రబల్లిపాళెం చెరువులోని చెట్లను జీ మణికంఠ రూ.1.76 లక్షలకు దక్కించుకున్నారు. ఏడు నెలల్లోగా కర్రతుమ్మ చెట్లను కొట్టుకోవాల్సి ఉంటుందని ఇరిగేషన్ ఏఈలు మహేంద్ర, శ్రీనివాసులు తెలిపారు.

అల్లూరులో భారీ వర్షం

అల్లూరు: మండల వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి విడతల వారీగా వర్షం కురవడంతో జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమవడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. అల్లూరులోని బీసీ కాలనీ వద్ద మెయిన్ రోడ్డుపై నీరు నిలవడంతో వాహనదారులు, పాదచారులు రాకపోకలకు అవస్థ పడ్డారు.



అల్లూరు బీసీ కాలనీలో మెయిన్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఉదయగిరి రూరల్: ఉదయగిరిలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ చెంగయ్య శుక్రవారం తెలిపారు. ఉదయగిరి పట్టణంతో పాటు గండిపాళెం, బిజ్జంపల్లి, కుర్రపల్లి, దుత్తలూరు ఫీడర్ల పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా ఉండదని వివరించారు.

సీతారామపురం : మండలంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు ఏఈ శ్రీహరి శుక్రవారం తెలిపారు. ఉదయగిరి మండలం కుర్రపల్లి నుంచి సీతారామపురం విద్యుత్ సబ్‌స్టేషన్ వరకు ఉన్న 33కేవీ లైన్ నిర్వహణ దృష్ట్యా సరఫరాను నిలిపివేస్తున్నామని వివరించారు.

వార్డెన్లతో సమీక్ష సమావేశం నేడు

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల సంక్షేమాధికారులతో శనివారం మధ్యాహ్నం సమీక్ష సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆత్మకూరు ఏఎస్‌డబ్ల్యూఓ కే బ్రహ్మానందాచారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో మధ్యాహ్నం 2 గంటల నుంచి జరిగే సమావేశానికి జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ నోడల్ అధికారిణి కే శోభారాణి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, సిక్స్ స్టెప్ వెరిఫికేషన్, జాయింట్ అకౌంట్లపై సమీక్షిస్తారని చెప్పారు. డివిజన్ పరిధిలోని వెల్ఫేర్ అసిస్టెంట్లు, డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్‌తో పాటు వసతి గృహ సంక్షేమాధికారులు హాజరుకావాలని కోరారు.

పశువైద్య శిబిరం

సీతారామపురం : మండలంలోని అయ్యవారిపల్లిలో రాష్ట్రీయ గోకుల మిషన్‌లో భాగంగా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ విస్తరణాధికారి శ్రీనివాసులు పాడిరైతులకు పశుపోషణలోని మెళకువలను వివరించారు. అనంతరం పశువులకు వైద్యపరీక్షలు నిర్వహించి మినరల్ మిక్చర్ ప్యాకెట్లు, మందులు ఉచితంగా అందజేశారు. అయ్యవారిపల్లి సర్పంచ్ దుర్గాప్రసాద్, ఉదయగిరి ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ డాక్టర్ శశిధర్, పశువైద్యాధికారి ఎస్వీ రాఘవేంద్ర, సంచార పశువైద్య వాహనం డాక్టర్ ఎర్రం నాయుడు, వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

నూరు శాతం ఫలితాలు సాధించాలి



ఉదయగిరిరూరల్: విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ తోట శ్రీనివాసులు



అనుమసముద్రంపేట: మాట్లాడుతున్న ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య

ఉదయగిరి రూరల్: పదోతరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని ఎంఈఓ–2 తోట శ్రీనివాసులు అన్నారు. గండిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను తనిఖీ చేసి ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. అనంతరం పది విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఆర్ రవీంద్రయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: పదోతరగతి విద్యార్థులు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలను సాధించాలని సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ వెంకటసుబ్బయ్య అన్నారు. ఏఎస్‌పేటలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని జీసీడీఓ మమతతో కలిసి శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదోతరగతి విద్యార్థినులతో ముచ్చటించారు. వసతులు, భోజనం నాణ్యతపై విద్యార్థులను ఆరాతీశారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన వంట మనిషి వెంకట రమణమ్మను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈఓ గది ప్రారంభం

ఆత్మకూరు: పట్టణంలోని హిల్‌రోడ్డులోని యాదవవీధిలోని వేణుగోపాలస్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ఈఓ గదిని దివంగత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బొమ్మిరెడ్డి సుందరరామిరెడ్డి సతీమణి అరవిందమ్మ, డాక్టర్ షకీలా శుక్రవారం ప్రారంభించారు. తమ కుటుంబ సభ్యులు సుందరరామిరెడ్డి, రవీంద్రారెడ్డి జ్ఞాపకార్థంగా రూ.3 లక్షలతో గది నిర్మాణం చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. భవిష్యత్‌లోనూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహాయసహకారాలను అందిస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సీహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్ పెంచలయ్య, ప్రవల్లిక, మాలకొండయ్య, ప్రదీప్, మల్లికార్జున, సాధిక్ హుస్సేన్, వెంకటయ్య, సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



ఈఓ గదిని ప్రారంభించిన బొమ్మిరెడ్డి కుటుంబీకులు

ఉపాధి శ్రామికులు ఈకేవైసీ చేయించుకోవాలి

ఉదయగిరి: ఉపాధి హామీ శ్రామికులు ఈకేవైసీని తప్పనిసరిగా చేయించుకోవాలని ఏపీడీ మృదుల తెలిపారు. పట్టణంలోని ఎస్సీ కాలనీలో చేపడుతున్న ఈకేవైసీ కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉదయగిరి నియోజకవర్గంలోని ఎనిమిది మండలాల్లో 1,26,032 మంది శ్రామికులు ఉండగా, ఇప్పటి వరకు 58,106 మంది ఈకేవైసీ చేయించుకున్నారని తెలిపారు. ఈ నెల 20వ తేదీలోగా మిగిలిన శ్రామికులు ఈకేవైసీని పూర్తి చేసుకోవాలని కోరారు. ఈసీ రవి, క్షేత్ర సహాయకులు ప్రసన్న, రమణ, సందానీబాషా, నరసింహరావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.



ఈకేవైసీని పరిశీలిస్తున్న ఏపీడీ మృదుల

సోలార్‌ప్లాంట్‌కు భూమిని కేటాయించొద్దని వినతి

ఉదయగిరి రూరల్: శకునాలపల్లి పంచాయతీ పరిధిలో కుర్రపల్లి బీసీ కాలనీ సమీపంలోని ప్రభుత్వ భూమిని సోలార్ ప్లాంట్ కేటాయించొద్దని స్థానికులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ ఎల్ రామ్మోహన్‌కు శుక్రవారం వినతి పత్రం అందించారు. తమ కాలనీ సమీపంలోని సర్వేనంబర్లు 161, 162లోని తొమ్మిది ఎకరాల భూమిని ప్రధాన మంత్రి కుసుం పథకంలో భాగంగా సోలార్ విద్యుత్ తయారీ కోసం నెడ్‌క్యాప్‌కు కేటాయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే సదరు భూమిలో తమకు నివేశన స్థలాలు మంజూరు చేసి ఉన్నారని తెలిపారు. మిగిలిన భూమిలో మూగజీవాలను మేపుకొంటూ జీవనం సాగిస్తున్నామని విన్నవించారు. జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి భూ కేటాయింపును విరమించుకోవాలని కోరారు. స్పందించిన తహసీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీపీఎం నాయకులు కాకు వెంకటయ్య, పీ నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.



పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులు బత్రెడ్డి పోలిరెడ్డి, గుండుబోయిన వెంకటరమణ, ముక్కు మస్తాన్‌గౌడ్ డిమాండ్ చేశారు. సోమశిల బస్టాండ్ సెంటర్‌లో శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న కాలనీలో డైరెక్ట్ పంపింగ్ స్కీం ఏర్పాటు చేయగా ప్రాజెక్టు కాలనీ, హిల్ కాలనీ వాసులు వినియోగించుకుంటున్నారని తెలిపారు. సజావుగా పనిచేస్తున్న డైరెక్ట్ పంపింగ్ స్కీం మోటార్‌కు మూడు నెలలకొకసారి మరమ్మతులు చేయిస్తున్నట్లుగా, డ్రైనేజీల్లో పూడికతీత, వీధిదీపాల ఏర్పాటు పేరుతో టీడీపీ నాయకులు పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీ నిధులు సుమారు రూ.10 లక్షల మేర దుర్వినియోగం చేయడంపై ఆధారాలతో సహా జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి స్పందించి పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాణసంచా విక్రయదారులు నిబంధనలు పాటించాలి



అల్లూరు: బాణసంచా విక్రయదారులతో మాట్లాడుతున్న కమిషనర్ ఉమామహేశ్వరరావు



ఉదయగిరిలో స్థల పరిశీలన చేస్తున్న అధికారులు

అల్లూరు: దీపావళికి బాణసంచా విక్రయించే వ్యాపారులు నిబంధనలను తప్పకుండా పాటించాలని కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎంపీడీఓ రజనీకాంత్ అన్నారు. మండల తహసీల్దార్ కార్యలయంలో బాణసంచా విక్రయదారులతో శుక్రవారం వారు సమావేశం నిర్వహించారు. బాణసంచా దుకాణాల వద్ద అగ్నిప్రమాదాల నివారణకు నీరు, ఇసుక అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం బాణసంచాను విక్రయించాలని తెలిపారు. డీటీ ప్రవీణ్ కుమార్, ఏఎస్సై వెంకటేశ్వర్లు, ఆర్ఐ ప్రభుదీప్ పాల్గొన్నారు.

ఉదయగిరి: పట్టణంలోని ఆనకట్ట సమీపంలోని ఖాళీ స్థలాన్ని దీపావళి బాణసంచా దుకాణాల ఏర్పాటుకు అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లాటరీ ద్వారా బాణసంచా దుకాణాలను కేటాయిస్తామని తెలిపారు. వ్యాపారులు ఖాళీ స్థలంలో ఒకవైపున మాత్రమే దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని, అగ్నిప్రమాదాల నివారణకు తగిన భద్రత చర్యలను పాటించాలని సూచించారు. తహసీల్దార్ ఎల్ రామ్మోహన్, ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి, ఎస్సై ఇంద్రసేనారెడ్డి అగ్నిమాపక అధికారి హరిబాబు, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా, ఇరిగేషన్ ఏఈలు వేణు, సురేష్ , తదితరులు పాల్గొన్నారు.

సీతారామపురం : మండలంలోని లైసెన్స్‌లు కలిగిన బాణసంచా విక్రయదారులతో తహసీల్దార్ షేక్ ఫజిహా, ఎస్ఐ శివకృష్ణారెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. అనంతరం మండల కార్యాలయాల ఎదురుగా ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు.

సంగం: స్థానిక శివాలయం సెంటర్ వద్ద ఉన్న ఖాళీ ప్రదేశాన్ని బాణసంచా దుకాణాల ఏర్పాటుకు రెవెన్యూ అధికారులతో కలిసి సీఐ వేమారెడ్డి శుక్రవారం పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు దుకాణాలను ఏర్పాటు చేసుకోవాలని లైసెన్స్‌డ్ వ్యాపారులకు సూచించారు.

నేల ఆరోగ్యంపై అవగాహన

ఉదయగిరి రూరల్/సీతారామపురం: విద్యార్థులు విద్యార్థి దశ నుంచే నేలపై ఆరోగ్యంపై సరైన అవగాహన కలిగి ఉండాలని నెల్లూరు భూసార పరీక్ష కేంద్రం ఏడీఏ కన్నయ్య అన్నారు. ఉదయగిరిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సీతారామపురంలోని ఆదర్శ పాఠశాలలోని విద్యార్థులకు నేల ఆరోగ్యంపై శుక్రవారం ఆయన అవగాహన కల్పించారు. భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, ఎరువుల యాజమాన్యం, స్థూల, సూక్ష్మపోషకాలపై అవగాహన కల్పించారు. ఉదయగిరి ఏడీఏ పీ.చెన్నారెడ్డి, ఏఓలు విజయభాస్కర్, రామ్మోహన్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉదయగిరిలో అవగాహన కల్పిస్తున్న ఏడీఏ